జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 23-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 347 పేజీలు: 4 వెల : రూ.7



* వాహనదారులకు స్లాట్ బుక్ కాదు.. 'క్యాష్ బుక్
* సేవల పేరుతో సొమ్ముల దోపిడీ!
* ఏజెంట్ల రాజ్యం.. అధికారుల భోజ్యం
* దరఖాస్తులపై కోడ్ ఉంటేనే పని పూర్తి
* ప్రతి పని కూ ఓ రేటు..
* అదనపు వసూళ్లకు ప్రత్యేక వ్యవస్థ
* ఏజెంట్లు, సంఘాల అండతోనే అక్రమాలు

**అనధికారిక రేట్లు ఇలా...**

ద్విచక్ర వాహన రిజిస్ట్రేషన్: రూ.1,000
కారు రిజిస్ట్రేషన్: రూ.2,000 - రూ.3,000
డ్రైవింగ్ లైసెన్స్ (బైక్): రూ.750
కారు డ్రైవింగ్ లైసెన్స్: రూ.2,500
ఇంటర్నేషనల్ లైసెన్స్: రూ.10,000
గ్రానైట్ లారీ: ఏడాదికి రూ.5,000 వరకూ

# రవాణా శాఖాధికారుల రూటు.. సెపరేట్




**శ్రీకాకుళం, మే 20(వార్త):** రవాణా శాఖ కార్యాలయాలు... ఇవి ప్రజలకు సేవలందించే కేంద్రాలా? లేక వసూళ్ల కేంద్రాలా? అనేదే ఇప్పుడు సర్వత్రా చర్చ. జిల్లా వ్యాప్తంగా డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు వంటి ఏ పని కావాలన్నా నిబంధనల కంటే 'అదనపు సొమ్ము' చెల్లించాల్సిందే. ఈ వ్యవహారంలో అధికారుల పాత్ర ప్రత్యక్షంగా కనిపించకపోయినా.. ఏజెంట్లు, సంఘాల ప్రతినిధులు, డీలర్లు మాత్రం కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రానికల్లా ఎవరి వాటా వారికే చెల్లించేందుకు ప్రత్యేక వ్యవస్థ కొనసాగుతోంది.

## ఫిట్నెస్ కోసం వేల రూపాయల భారం

శ్రీకాకుళం నగర శివారులోని ఓ పేరొందిన ఇంజినీరింగ్ కళాశాల సంవత్సరానికి ఒక్కో బస్సుకు రూ.4,500 చొప్పున అదనంగా చెల్లిస్తోంది. జిల్లాలో ఇతర విద్యాసంస్థలు రూ.2,000 నుంచి రూ.2,500 వరకు ఇస్తున్నాయి. స్కూల్, కాలేజీ బస్సుల లావాదేవీలను స్థానిక సంఘాల ప్రతినిధులే చూసుకుంటున్నారు. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 500కు పైగా విద్యాసంస్థల బస్సులు ఉన్నట్లు అంచనా.

## ఏ పని అయినా.. ముందుగా క్యాష్ కావాలంట!

వాహన ఫిట్నెస్, డ్రైవింగ్ లైసెన్స్, కొత్త వాహన రిజిస్ట్రేషన్ వంటి పనులకు రవాణా శాఖ కార్యాలయాల్లో నేరుగా వెళ్లినా తిప్పలు తప్పవు. దరఖాస్తు ఫారాలపై ఏజెంట్లు రాసే ప్రత్యేక కోడ్ ఉంటేనే పని త్వరగా పూర్తవుతోంది. లేకుంటే చిన్నచిన్న సాంకేతిక లోపాలను చూపుతూ దారిలో తిప్పుతున్నారు.

## ఇసుక, గ్రానైట్ లారీల 'లావాదేవీలు కూడా'

ఇసుక రీచ్‌లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఓవర్‌లోడ్ లారీలకు అధికారులు రూ.4,000 చొప్పున డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. లేదంటే బండిని సీజ్ చేస్తామనే బెదిరింపులు. గ్రానైట్ బ్లాకులు తరలించే ట్రాలీల నుంచి కూడా భారీగా వసూలు జరుగుతోంది. వాహన నంబర్లు ముందుగానే చెప్పకపోతే కేసులు తప్పవన్నది అందరికీ తెలిసిన విషయం. కానీ నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధుల సిఫార్సుతో మాత్రం ప్రత్యేక సడలింపులు ఉంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

## నిత్యం వసూలు.. సాయంత్రానికి పంపకాలు!


రవాణా శాఖలోని కొన్ని కార్యాలయాల్లో సాయంత్రానికల్లా ఎవరికి వారి వాటా చేరేలా పంపకాలు జరుగుతున్నాయన్నది ఓపెన్ సీక్రెట్. కొన్ని చోట్ల అధికారుల తరపున ప్రైవేటు వ్యక్తులు డీల్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

## ఏజెంట్లతోనే వసూళ్లు..

శాఖలో ఉద్యోగుల సంఖ్యకు తగినట్టుగా వసూలయ్యే మొత్తం తక్కువవుతోందని, అందుకే ఏజెంట్లపై అధిక మొత్తాలు వసూలు చేయాలన్న ఒత్తిళ్లు పెరిగాయని సమాచారం. నిజాయితీగా పనిచేస్తున్న కొంతమంది అధికారులున్నా, సిస్టమ్ మొత్తంగా బలహీనంగా మారిందన్నది స్పష్టమవుతోంది.

## చివరికి...

పౌరులు న్యాయమైన సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా, అనధికారిక వ్యవస్థలు విపరీతంగా విస్తరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. శ్రీకాకుళంలో సాగుతున్న ఈ వ్యవహారం, 'అధికారికంగా లేనిపనులు, అధికారుల అనుమతితో జరుగుతున్నాయి' అనే సంకేతాన్ని పంపుతోంది.



## అదనపు సొమ్ముకు కక్కుర్తిపడి..

* ఏసీబీకి చిక్కిన పలాస తూనికలు కొలతల శాఖ అధికారి
* 1.78 లక్షలు లంచం తీసుకున్న ఇన్‌స్పెక్టర్ శ్రీధర్
* 445 మంది ట్రేడర్స్ నుంచి అక్రమ వసూళ్లు
* వెరిఫికేషన్ సర్టిఫికెట్ కోసం డబ్బులు డిమాండ్
* ఏసీబీని ఆశ్రయించిన వ్యాపారులు

## జై భజరంగభళి

* నగరంలో శోభాయమానంగా హనుమాన్ శోభా యాత్ర
* విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ
* వేలాదిగా తరలివచ్చిన భక్తులు
* జై శ్రీరామ్.. జై హనుమాన్ నినాదాలతో మార్మోగిన సిక్కోలు



లోపలి పేజీల్లో..



## ప్రజల భాగస్వామ్యంతోనే.. గ్రామాభివృద్ధి

* గ్రామాలను సుందరవనాలుగా తీర్చిదిద్దాలి * ఆడబిడ్డలకు రక్షణ కవచంగా నిలబడాలి * రావివలస గ్రామాభివృద్ధికి రూ.15కోట్లు మంజూరు * 'మన ఊరు - మాటా మంతి'లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ * టెక్కలి భవానీ థియేటర్‌లో వర్చువల్‌లో ప్రజలతో డిప్యూటీ సీఎం ముఖాముఖి

4లో



## పేరు లేని భవనమిది!



**సరుబుజ్జిలి, మే 22 (వార్త):** సరుబుజ్జిలి మండలం కేంద్రంలోని వెలుగు కార్యాలయానికి గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా గుర్తింపు (నేమ్) బోర్డ్ ఏర్పాటు చేయలేకపోవడం హాస్యాస్పదం. ప్రజలకు అందుబాటులో ఉండడానికి సరుబుజ్జిలి మండలం కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన వెలుగు ఆఫీసుకు ఇప్పటివరకు బోర్డు ఏర్పాటు చేయలేదు. ఇతర గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు వెలుగు ఆఫీసు కు బోర్డు లేకపోవడంతో స్థానికంగా ఉండే వారిని అడ్రస్ అడిగి తెలుసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందిస్తారో లేదో చూడాలిమరి.

# లక్ష మొక్కల పెంపకమే లక్ష్యం

*** పెంచే ప్రదేశాలు గుర్తించండి * కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, మే 22(వార్త):** జిల్లాను హరిత జిల్లాగా మార్చేందుకు గాను లక్షమొక్కల పెంపకమే లక్ష్యంగా చేసుకున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడిన ఆయన మొక్కలు పెంచేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని అటవీ, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. చెరువుల గట్లు, కాలువల పక్కన మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సీఎస్ఆర్ నిధులను వినియోగించేలా చూడాలని తెలిపారు. ప్రజలు కూడా భారీగా భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. మొక్కల రక్షణ అత్యవసరం అని, ఓపెన్ ప్రదేశాలలో రక్షణ ఉండదని, క్లోజ్డ్ కాంపౌండ్, హాస్పిటల్ లాంటి ప్రదేశాల్లో నాటితే మెరుగైన ఫలితాలు ఉంటాయని చెప్పారు. ఫెన్సింగ్ తప్పనిసరిగా సిమెంట్, కాంక్రీట్ లేదా ఇటుకలతో ఉండాలని, లేకపోతే మొక్కలు నశించిపోతాయని హెచ్చరించారు. ప్రతి విభాగం తన పేరుతో మొక్కలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయించి, స్థానికులను వాటి సంరక్షణకు ప్రోత్సహించాలని తెలిపారు. ఈ ఉద్యమాన్ని ప్రజల భాగస్వామ్యం తో చేపట్టి జిల్లాను పచ్చదనంతో నిండేలా చేయాలని పిలుపునిచ్చారు.

### వార్డు సచివాలయాల పనితీరుపై సమీక్ష

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో వార్డ్ సచివాలయాల పనితీరును జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమీక్షించారు. సమీక్షలో పలు శాఖల పరిధి అంశాలపై చర్చించారు. రెవెన్యూ విభాగంలో డిమాండ్-కలెక్షన్-బ్యాలెన్స్ ప్రకారం నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. యూపీఐ కోడ్‌ల ద్వారా వసూళ్లను పెంచాలని, మున్సిపల్ ఆస్తులైన షాపులు, అద్దెలపై కఠినంగా వసూళ్లు జరగాలని ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగంలో సానిటేషన్ కార్మికుల హాజరు నియమితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, డ్రెయిన్ల డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలని చెప్పారు. కమ్యూనిటీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పూర్తిగా ఆపరేషన్‌లోకి తేవాలని, మున్సిపల్ వాహనాల నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ల ప్రగతిపై సమీక్షించారు. జిందాల్ ప్లాంట్‌కు వ్యర్థాల రవాణాపై స్పష్టత కోరారు. టాయిలెట్ల నిర్వహణ, కొత్తగా నిర్మించే టాయిలెట్లపై కార్యాచరణ చేపట్టాలని చెప్పారు. ఇంజనీరింగ్ శాఖ పరిధిలో మంజూరైన గ్రాంట్లు, జనరల్ ఫండ్ పనుల పురోగతిపై సమీక్షించి, పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో నిర్మాణాలు, కూల్చివేతల వ్యర్థాల నిర్వహణపై ఫోకస్ చేయాలని, ప్లానింగ్ సెక్రటరీల జాబ్ చార్ట్‌ను పాటించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విభాగంలోనూ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్, ఆయా వార్డు సచివాలయాల అడ్మిన్లు, వల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

### యోగా దినోత్సవం విజయవంతానికి ప్రత్యేక కార్యాచరణ

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్21న విశాఖపట్నంలో జరిగే ముఖ్య కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు గ్రామ స్థాయి వరకు యోగా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ పలు అంశాలపై చర్చించారు. ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంచే ఉద్దేశంతో ప్రతి మండలానికి ఓ మాస్టర్ ట్రైనర్‌ను నియమించాలన్నారు. వీరు ఆయా మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు యోగా వినియోగాన్ని వివరించాలన్నారు. అలాగే మండల స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, ఈ కార్యక్రమాలను పర్యవేక్షించే బాధ్యత అప్పగించాలన్నారు. జిల్లా కేంద్రం, మండల కేంద్రాలు, ఇతర ప్రముఖ ప్రాంతాల్లో రోజువారీగా యోగా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల్లో చైతన్యం కలిగించేలా పోస్టర్లు, ప్రకటనల ద్వారా ప్రచారం నిర్వహించాలన్నారు. అధికారులు తమ విభాగాల్లోని సిబ్బందిని యాక్టివ్‌గా పాల్గొనేట్లు ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేకతతో యోగా కార్యక్రమం నిర్వహించనున్నారని, శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారులతో ఒకరోజు ప్రత్యేకంగా యోగా శిబిరం నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు.



## మాజీ మంత్రి అప్పలరాజు పర్యటన

**మందస, మే 22(వార్త):** మందస మండలంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పర్యటించారు. గిరిజన ప్రాంతమైన చీపి పంచాయతీ బొందికారి గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు సవర రామదాసు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంగతి తెలుసుకొని డాక్టర్ సీదిరి అప్పలరాజు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో పాటు మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, పార్టీ మండల అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి, మాజీ ఎమ్పీపీలు సవర కామేసు, బత్తిన హేమేశ్వరరావు సాబకోట, చీపి, టంగరపుట్టి సర్పంచ్ లతో పాటు గిరిజన సంఘ నాయకులు సవర జగన్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ వివాహ కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. మూలిపాడులో తెలుకుల కృష్ణ, చీపి పంచాయతీ బొందికరిలో తిరుపతి వివాహ వేడుకలు లో పాల్గొని నూతన దంపతులను అభినందించారు.

## కూటమి ప్రభుత్వ హయాంలో నారాయణపురం-సరియాపల్లి రహదారి



**మందస, మే 22(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన నారాయణపురం పంచాయతీ నుంచి సరియాపల్లి పంచాయతీలను కలుపుతూ నిర్మించిన రహదారి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనమని జనసేన మండల ఉపాధ్యక్షుడు పందిరి నీలయ్య, కార్యదర్శి తెలుకుల సందీప్ అన్నారు. నారాయణపురం పంచాయతీ నుంచి సరియాపల్లి రహదారిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పలాస నియోజక వర్గం ఎమ్మెల్యే గౌతు శిరీషా ప్రత్యేక కృషితో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రూరల్ డెవలప్మెంట్ మినిస్టర్ పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో ఎంతోకాలంగా ఉద్దాన ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్న నారాయణపురం పంచాయతీ-సరియాపల్లి పంచాయతీలను కలిపే పెద్ద కేసుపురం నుండి జి.బహడపల్లి మీదుగా చిన్నబహడపల్లి వరకు సుమారు రెండు కిలోమీటర్లు పొడవున ఇటీవల కాలంలో నూతనంగా వేసిన బీటీ రోడ్డును ఈ ప్రాంతీయులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. పల్లెలపై ప్రభుత్వానికి ఉన్న ప్రేమ, చిత్తశుద్ధికి ధన్యవాదాలు తెలిపారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేయాలి





**శ్రీకాకుళం, మే 22 (వార్త):** రాష్ట్రంలో ఉన్న అర్హులైన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, డెస్క్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేయాలని, గత ప్రభుత్వం ఇచ్చిన జీఓఎంఎస్ నెంబర్ 142ను రద్దుచేసి వర్కింగ్ జర్నలిస్టుల అందరకీ సత్వరమే జాప్యం చేయకుండా సకాలంలో అక్రిడేషన్లు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు ఎల్. స్వర్ణలత, ఓ.మధుసూధన్ లకు ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగినాయుడు వినతిపత్రాలను అందజేశారు. గత ప్రభుత్వం మీడియా సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్షం చేసిందని అర్హులైన వారికి కనీసం అక్రిడేషన్ కార్డు ఇవ్వలేకపోయారన్నారు. దీనివల్ల మీడియాను నమ్ముకొని జీవనం సాగించే అనేక కుటుంబాలు ఇబ్బందులు పడ్డారని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీడియా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని, జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ సౌకర్యం, ఇల్లు లేని వారికి ఇల్లు, వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని జోగినాయుడు డిమాండ్ చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పత్రికలకు.. టీవీ ఛానల్స్ కు యుద్ధప్రాతపదికన అక్రిడేషను కార్డులు జారీ చేయాలని, మీడియా అక్రిడేషన్ కమిటీల్లో గుర్తింపు పొందిన జర్నలిస్టు యూనియన్స్‌కు సముచిత స్థానం కల్పించాలని ఆయన సూచించారు. ప్రెస్ అకాడమీకు చైర్మన్‌గా ఒక సీనియర్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆలపాటి సురేష్ కుమార్‌ను నియమించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి, కూటమి నేతలకు జోగినాయుడు కృతజ్ఞతలు తెలిపారు.



## మందస తహశీల్దార్‌గా మిస్క శ్రీకాంత్

**మందస, మే 22(వార్త):** మందస మండల తహశీల్దారుగా మిస్క శ్రీకాంత్ గురువారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాంత్ జి.సిగడాం తహసీల్దారుగా విధులు నిర్వహించి, మందసకు డిప్యూటేషన్ తహశీల్దారుగా నియమితులయ్యారు. ఎంతో మంచి అధికారిగా గుర్తింపు ఉన్న శ్రీకాంత్ మందస తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టడంతో కార్యాలయాన్ని సరిదిద్దుతారని స్థానికులు ఆశిస్తున్నారు. గత తహశీల్దార్ హయాంలో ఆఫీసు పని తీరుపై తీవ్ర ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మిస్క శ్రీకాంత్‌కు కార్యాలయ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, స్థానిక పెద్దలతో పాటు మండల అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## జ్ఞాన భారతిలో అంతర్జాతీయ జీవవైవిద్య దినోత్సవం

**ఇచ్ఛాపురం, మే 22 (వార్త):** అంతర్జాతీయ జీవవైవిద్య దినోత్సవం సందర్భంగా జ్ఞాన భారతి పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్య నిర్వహణ అధికారి జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవ వైవిధ్యానికి ప్రతీకగా నిలిచే విధంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన వివిధ పక్షుల ఆవాసాల వద్ద జీవ వైవిధ్యాన్ని కాపాడాలని కోరుతూ నినాదాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జోహార్ ఖాన్ మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని కాపాడాలని, జీవ వైవిద్యాన్ని కాపాడడం భవిష్యత్తును కాపాడటమేనని అన్నారు. ప్రకృతిలో ఉన్న అన్ని జీవరాశులను, ప్రకృతి ప్రసాదాలను, నదులను, నీటి వనరులను కాపాడుకోవడమే లక్ష్యంగా ప్రస్తుత తరం ఆలోచన విధానం ఉండాలని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం అందులో ప్రధానమని తెలిపారు. పాఠశాలలో వివిధ రకాల పక్షులు, కుందేళ్లు, బాతులు, శునకాలు వంటి జీవరాశులకు ఆవాసం కల్పిస్తూ, పర్యావరణాన్ని, పచ్చదనాన్ని పెంచే విధంగా మొక్కలు నాటడం ప్రత్యేక కార్యక్రమం గా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ ఐబీ పండా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ , ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.




## విద్యార్థులకు పోటీలు



**మందస, మే 22(వార్త):** మందస పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అదేవిధంగా గత రెండు రోజులుగా షటిల్ బ్యాట్మెంటేన్ పోటీలు, ఇంగ్లీష్ తరగతులు కూడా నిర్వహించారు. గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.

## మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు



**పలాస, మే 22, (వార్త):** 2025-2026 విద్యా సంవత్సరానికి గాను పలాస మండలానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఒకటో తరగతి నుండి పదవ తంగతి వరకు సుమారుగా 32 వేల పుస్తకాలు వచ్చాయి. వీటన్నిటినీ మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో సంబంధిత పాఠశాలలకు పంపిణీ చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సెక్యూరిటీ గార్డు నిజాయితీ



**పలాస, మే 22 (వార్త):** పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్ నిజాయితీని పలువురు అభినందించారు. అక్కుపల్లి గ్రామానికి చెందిన అంబటి భవాని వైద్య సేవలు పొందేందుకు పలాస ప్రభుత్వ హాస్పిటల్‌కి గురువారం వచ్చింది. ఆమె ఆసుపత్రిలోనే బంగారు పుస్తెలతాడును పోగొట్టుకుంది. ఆ బంగారు పుస్తెలతాడు సెక్యూరిటీ గార్డుకు దొరకగా హెడ్ నర్స్ ఉమాదేవికి అందజేశారు. ఆ విషయాన్ని ఆమె కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించింది. పుస్తెల తాడు విషయమై కేసు నమోదుకు వచ్చిన భవానీకి ఏఎస్ఐ సంజీవరావు, పోలీసులు, హెడ్‌నర్సు అందజేశారు.



## కనీస వసతుల్లేని సరుబుజ్జిలి బస్టాండ్

**సరుబుజ్జిలి, మే 22 (వార్త):** పేరుకే ఆర్టీసీ బస్టాండు. అక్కడ కనీస వసతుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు ఆర్టీసీ బస్టాండు నుంచి వందలాది మంది విద్యార్థులు, ప్రజలు ఇతర ప్రాంతా లకు వెళు తుండడం ఇతర ప్రాంతాల వారు ఇక్కడికి వస్తుండడం జరుగుతుంటుంది. అయితే అందుకు తగినట్లు సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. బస్టాండులో మరుగు దొడ్లు, మూత్ర శాలలు కొన్ని రోజులుగా నిర్వహణ లేకపోవడంతో దుర్భరంగా మారాయి. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండు పక్కనే ప్రాథమిక పాఠశాల ప్రహరీ వద్ద ఉన్న స్థలాన్ని పురుషులు మూత్రశాలగా వినియోగిస్తుండడంతో దుర్గంధం భరించలేకపోతున్నామని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండును శుభ్రం చేయకపోవడంతో బెంచీల కింద చెత్తచెదారం పేరుకుపోయింది. మరుగుదొడ్ల వద్ద మురుగు నీరు, చెత్తాచెదారం దుర్గధం వెలువడు తోంది. బస్టాండులోని రోడ్డు కంకర తేలడంతో బస్సు ఎక్కే సమయంలో వృద్ధులు, పిల్లలు కంకరపై నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ కంట్రోలర్ లేకపోవడంతో ప్రయాణికులకు సమాచారం ఇచ్చేవారు కరువయ్యారు.

## సమగ్ర సర్వే పూర్తి చేయండి




**పలాస, మే22 (వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఆస్తి పన్ను సర్వే, ఉద్దానం తాగునీటి పథకము ద్వారా అదనపు పైపులైను సర్వే, అదనపు ఇంటింటి కొళాయి కనెక్షన్ల సర్వేపై గురువారం మున్సిపల్ కార్యాల యంలో అడ్మిన్ కార్యదర్శులు, ఎమినిటీ కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శులు, ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులతో కమిషనర్ నడిపేన రామారావు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం వారు ఆస్తి పన్నులు 20శాతం మదింపు అనగా అన్ అసెస్మెంట్ భవనాలు, అండర్ అసె స్మెంట్ భవనములు గుర్తించి వాటిని ఆన్లైన్ చేయుటకు సంబంధిత డాక్యుమెంట్లు పరిశీలించాలన్నారు. ఉద్దానం తాగునీటి సరఫరా పథకం ద్వారా 5 ఎం ఎల్ డి నీరు సరఫరాకు సదరు మంచినీటిని పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలలోని అన్ని వార్డులకు అన్ని వీధులకు సరఫరా చేసే విధంగా ప్రణాళికలు రూపొందించడానికి వీలుగా సచివాలయంల పరిధిలో ప్రతివీధిని సర్వే చేసి ఎంతమేరకు పైప్లైన్లు కొత్తగా వేయవలసి ఉన్నది, ఎన్ని పబ్లిక్ కుళాయిలు ప్రస్తుతం పనిచేస్తున్నది, ఎన్ని పని చేయట్లేదు, ఎంత మందికి కొత్తగా కొళాయి కనెక్షన్లు అవసరం అనేది ఈనెల 27లోగా సర్వే చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో సచివాలయం కార్యదర్శులు, మున్సిపల్, రెవిన్యూ అధికారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారుల నిర్మాణం పూర్తి చేయండి

**కొత్తూరు, మే 22 (వార్త):** కొత్తూరు మండలంలో ఉన్న ప్రధాన రహదారుల నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తూరు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అలికాం-బత్తిలి ప్రధానరహదారి, పాలకొండ రోడ్, వసప -నివగాం రహదారి పూర్తిగా గోతులు మయమై ప్రజలు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా ధ్వంసం అయిన ప్రధాన రహదార్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చి సంవత్సరం అవుతున్నా నేటికీ రహదార్ల నిర్మాణం చేపట్టకపోవడం అన్యాయమన్నారు. కొత్తూరు-పారాపురం, వసప-నివగాం మధ్య రోడ్డులో కాలు వలు, రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని రెండు నెలలు కిందట అధి కార పార్టీ నేతలు ప్రకటించినా నేటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. వర్షాలు పడుతుండడంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయన్నారు. రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు.

## నీటిని వృథా చేయొద్దు

**పలాస, మే 22 (వార్త):** నీటిని వృథా చేయకుండా పరి రక్షించాల్సిన బాధ్యత మనం దరిపై ఉందని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. గురువారం పలాస మున్సిపల్ కార్యాలయంలో ఆవరణలో ఉన్న బోరుబావు సామగ్రిని పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి దృష్ట్యా బోరుబావులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు కావలసిన సామగ్రిని మున్సిపల్ విధులతో కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఆయన వెంట సవర సోమేశ్, రామకృష్ణ, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు

**✻ కేంద్ర మంత్రి రామ్మోహన్ ✻ జిల్లా కేంద్రంలో మినీ మహానాడు**

**శ్రీకాకుళం, మే 22 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని 80 ఫీట్ రోడ్డులో గల ఎన్టీఆర్ భవన్ ఆవరణలో మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి ఎంపీతో పాటు ఎమ్మెల్యేలు, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. తెలుగువాడి ఆత్మగౌరవం కోసం నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. ఆయన అడుగుజాడల్లో సీఎం చంద్రబాబు ముందుకు సాగుతూ అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తితో పాటు మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ , టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**పలాస, మే 22(వార్త):** హనుమాన్ జయంతి సందర్భంగా పలాస, పురుషోత్తపురం, ముత్యాలమ్మ కోనేరు, న్యూ కాలనీ దుర్గ మండపం వద్ద భక్తులు పెద్ద ఎత్తున పూజలె నిర్వహించారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి అర్చకులు విశేష అర్చనలు చేశారు. మందిరాల వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అంబటి ఆనందరావు, ధర్మాపు విజయ్ కుమార్, దూపాన కృష్ణారావు, పొట్నూరు. షణ్ముఖరావు, పొట్నూరు అచ్యుత రావు, గజ్జి బాలయ్య, కోవిరి జగన్, కోనేరు కాళిదాస్, బమ్మిడి సుధాకర్, బుర్జిపేట గోవింద్, కోవిరి దేవరాజు, చీకటి కామరాజు, పత్తి వెంకట రవణ, నారంశెట్టి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


### హనుమాన్ విగ్రహానికి తిరువీధి

**మెళియాపుట్టి:**జలకలింగుపురంలో గురువారం హనుమాన్ జయంతి వేడు కలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మందిర అర్చకులు గిరిబాబు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి విగ్రహానికి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.



## మేజర్ రామ్ గోపాల్ నాయుడుకు గ్యాలంటరీ అవార్డు

**సంతబొమ్మాళి, మే 22 (వార్త):** సంతబొమ్మాళి పంచాయతీ నగిరిపెంట గ్రామానికి చెందిన ఆర్మీ మేజర్ మళ్ళ రామ్ గోపాల్ నాయుడు భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా గ్యాలంటరీ-2025 అవార్డును గురువారం అందుకున్నారు. స్వాతంత్ర దినోత్సవం-2024, గణతంత్ర దినోత్సవం-2025 నాడు ప్రకటించిన శౌర్య పురస్కారాల ప్రదానోత్సవంలో భాగంగా రాష్ట్రపతి భవనంలో ఈ అవార్డును అందుకున్నారు. భారత ప్రభుత్వం రక్షణ మంత్రత్వ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. జమ్మూ కాశ్మీర్‌లోని రాష్ట్రీయ రైఫిల్స్ బెటాలియన్‌లో మేజర్ రామ్ గోపాల్ నాయుడు పనిచేస్తున్నారు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడంతో తల్లిదండ్రులు మళ్ళ. అప్పలనాయుడు, హేమమాలిని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.



## 70 ఏళ్ల వృద్ధులకు పీఎంజేఏవై ఆసరా

### బీజేపీ శ్రీకాకుళం జిల్లా పూర్వ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు



**శ్రీకాకుళం, మే 22 (వార్త):** 70 ఏళ్ల వృద్ధులకు ఆసరాగా పీఎంజేఏవై ఉంటుందని బీజేపీ శ్రీకాకుళం జిల్లా పూర్వ అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్లు ఉన్న వృద్ధులకు ఈ పథకం కింద ఐదు లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో దేశంలో ఎక్కడి నుంచైన అమలు చేస్తుందన్నారు. వారికి ఆధార్ కార్డు ఉంటే చాలన్నారు. అర్హులైన వారంతా పీఎంజేఏవైకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇది హెల్త్ స్కీం అని తెలిపారు. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

## ఆర్టీసీ బస్ స్టేషన్లలో షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, మే 22 (వార్త):**శ్రీకాకుళం జిల్లాలో గల పలాస, టెక్కలి, శ్రీకాకుళం 1, 2వ డిపోల పరిధిలోకి వచ్చే ఆర్టీసీ బస్ స్టేషన్ల పరిధిలోని 66 షాపులలో అనుమతించబడిన వ్యాపారం నిర్వహించుటకు, ఔత్సాహిక వ్యాపారవేత్తలు టెండర్ ఫారం ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి, ఏ.విజయ కుమార్ తెలిపారు. ఈ నెల 28వ తేదీలోగా డిపో మేనేజర్ల కార్యాలయాలలో టెండరు ఫారాలు అన్ని పని దినములలో ఉదయం గం.10.30ల నుండి సాయింత్రం గం.5ల లోగా కొనుగోలు చేయవచ్చని, 29వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలలోపు టెండర్ ఫారాలను టెండరు బాక్స్ లో వేయాలని, మధ్యాహ్నం 3 గంటలకు టెండరు దారుల సమక్షంలో బాక్సులను తెరుస్తారని తెలిపారు.

# జై భజరంగభళి


*** నగరంలో వైభవంగా హనుమాన్ శోభా యాత్ర * విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ * వేలాదిగా తరలివచ్చిన భక్తులు * జై శ్రీరామ్.. జై హనుమాన్ నినాదాలతో మార్మోగిన సిక్కోలు**



**శ్రీకాకుళం, మే 22 (వార్త):** జై భజరంగబలి.. శ్రీరామ్.. జై హనుమాన్ నినాదాలతో శ్రీకాకుళం నగరం మార్మోగింది. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో 1500 మందితో భారీగా శోభాయాత్ర నిర్వహించారు. 80 అడుగుల రోడ్డులో ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ పసగాడ మిల్లు జంక్షన్, ఏడు రోడ్ల జంక్షన్, డే అండ్ నైట్ జంక్షన్ మీదుగా బలగ వరకూ సాగింది. వేలాదిగా భక్తులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విశ్వహిందు పరిషత్ సభ్యులతో పాటు బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. ప్రత్యేక రథంపై హనుమాన్ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి సింహాద్రి ఫల్గుణ రావు, పూడి తిరుపతి రావు వేణుగోపాల్, ఉమామహేశ్వరి, వెంకటేశ్వర్లు, సురేష్ సింగ్, బాల త్రిపుర సుందరి కాలభైరవ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు గణేష్ పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే.. గ్రామాభివృద్ధి

*** గ్రామాలను సుందరవనాలుగా తీర్చిదిద్దాలి * ఆడబిడ్డలకు రక్షణ కవచంగా నిలబడాలి * రావివలస గ్రామాభివృద్ధికి రూ.15కోట్లు మంజూరు * 'మన ఊరు - మాటా మంతి'లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ * టెక్కలి భవానీ థియేటర్‌లో వర్చువల్‌లో ప్రజలతో డిప్యూటీ సీఎం ముఖాముఖి**





**టెక్కలి/సంతబొమ్మాళి, మే22 (వార్త):** గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. 'మన ఊరు - మాటా మంతి' కార్యక్రమం టెక్కలి మండలం రావివలస గ్రామానికి సంబంధించిన ప్రజలతో టెక్కలి భవానీ సినిమా థియేటర్‌లో వర్చువల్ ద్వారా ముఖాముఖి కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సినిమా థియేటర్లు సినిమాలు, వినోదాలకే కాదు.. సామాజిక బాధ్యతను ఉపయోగపడటం సంతోషంగా ఉందన్నారు. గ్రామ ఉమ్మడి ఆస్తులు కాపాడాలని, పాఠశాల ఆవరణలో ఆకతాయిలు చేసే పనులను అడ్డుకోవాలన్నారు. వర్షాకాలంలో నీరు వృదాగా పోకుండా ప్రతీ ఇంటి వద్ద



ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇంకుడు గుంతలు వలన భూ గర్భ జలాలు పెరిగి భావితరాలకు, తాగు, సాగుకు ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లో నాటే మొక్కలు మనమే సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. మొక్కలను సంరక్షించుకొని సుందర వనాలుగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పిల్లలు సెల్ ఫోన్‌లకు అలవాటు పడకుండా వారు ఆడుకొనేటట్లు ప్రభుత్వ ఖాళీ స్థలాలను బాగుచేసి ఆట స్థలాలుగా మారిస్తే వారు ఫిట్‌నెస్ పెంచుకోవచ్చని చెప్పారు. ఆడబిడ్డలకు గ్రామ సమాజం రక్షణ కవచంలా నిలడాలన్నారు. గ్రామాల నుండి ఉన్నత స్థాయికి చేరుకున్న వారు తమ గ్రామాలను మరచిపోకుండా గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని కోరారు. అనంతరం రావివలస గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రావివలస గ్రామ అభివృద్ధికి 15 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు పవన్ కళ్యాణ్ చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వర్చువల్‌గా మాట్లాడుతూ ఒక వినూత్నమైన కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. గత కొన్నేళ్లుగా కేంద్రంలోను, రాష్ట్రంలోను పరిపాలన చేసిన ప్రభుత్వం అభివృద్ధి, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్‌ను ఉపయోగించుకొని దాదాపు 15 లేదా 20 పనులను అనుసంధానం చేసి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించి గ్రామానికి అవసరమైన పనులు గ్రామస్తులే నిర్వహించుకొనే వీలుకల్పించినట్లు చెప్పారు. టెక్కలికి కూత వేటు దూరంలో ఉన్న రావివలసలో అన్ని మతాలు, కులాలు కలిగి ఉన్న గ్రామమని, ఈ ప్రాంతానికి ఉప ముఖ్యమంత్రి వస్తే తీసుకువస్తామన్నారు. ఇక్కడ ప్రసిద్ధ గాంచిన ఎండల మల్లిఖార్జున శివాలయం ఉందని, రావివలసను ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, రావివలస, దామోదరపురం, చిననారాయణపురం గ్రామాలకు కాలువలు, రహదారులు, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. బోరు వేస్తే ఉప్పు నీరు పడుతుందని డిప్యూటీ సీఎం దృష్టికి అచ్చెన్న తీసుకువెళ్లారు. టెక్కలి నుండి తాగు నీరు సరఫరా చేయమని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. పాఠశాల వద్ద కాంపౌండ్ వాల్ నిర్మిస్తే బాగుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు ఎల్. ఎల్.నాయుడు, పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ కాలువలు లేకుండా గృహ నిర్మాణాలకు అధికారులు అనుమతులు జారీ చేస్తున్నారని, స్మశానాలకు రహదారులు లేవని, పుష్కరిణికి మెట్లు లేవని, కార్తీక సోమవారాల సమయంలోను, మహాశివరాత్రి సమయంలో భక్తులకు ఇబ్బందులు కలుగుతుందని, పుష్కరిణి వద్ద స్నాన ఘట్టం నిర్మించాలని, మహాశివరాత్రి సమయంలో ప్రజలు ఎక్కువగా వస్తున్నందు వలన రహదారులు చిన్నవిగా ఉన్నాయని, వెడల్పు చేయాలని పలు సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ కాలువలు లేకుండా లే అవుట్ లకు అనుమతులు ఇవ్వరాదని, రహదారి సింగిల్ లైన్ లో ఉందని దానిని డబుల్ రోడ్ గా వేయొచ్చని, దీనిపై సర్వే చేస్తామన్నారు. ఈ రోడ్డు ఉపాధి హామీ కింద వేయొచ్చని 3 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని చెప్పారు. బరియల్ గ్రౌండ్ కు రహదారి ఉపాధి హామీ పథకం ద్వారా వేయొచ్చని చెప్పారు. గ్రామంలో అంతర్గత రహదారులు, కాలువలు వేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే వర్షం నీరు వృధా కాకుండా ఇంకుడు గుంతల్లో ఉండి భూ గర్భ జలాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కిచెన్ గార్డెన్స్ వద్ద మొక్కలు నాటితే బాగుంటుందని, కాలువలు నిర్మించకపోతే కాలువల నీరు రోడ్లపైకి వస్తుందన్నారు. సామూహిక ఇంకుడు గుంతలు నిర్మిస్తే వర్షం నీరు నేరుగా ఇంకుడు గుంతల్లోకి చేరుతుందని చెప్పారు. 25 ఇంకుడు గుంతలు గ్రామానికి మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. రావివలస కార్యదర్శి రవి కుమార్ పంచాయతీకి సంబంధించిన సమాచారాన్ని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్రం నుండి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా అధికారులు, టెక్కలి నుండి ఆర్డీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్, ఎంపిడిఓ, రావివలస గ్రామ ప్రజలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## అదనపు సొమ్ముకు కక్కుర్తిపడి..

*** ఏసీబీకి చిక్కిన పలాస తూనికలు కొలతల శాఖ అధికారి * 1.78 లక్షలు లంచం తీసుకున్న ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ * 445 మంది ట్రేడర్స్ నుంచి అక్రమ వసూళ్లు * వెరిఫికేషన్ సర్టిఫికెట్ కోసం డబ్బులు డిమాండ్ * ఏసీబీని ఆశ్రయించిన వ్యాపారులు**

**పలాస, మే 22(వార్త):** వ్యాపారుల నుంచి అదనపు సొమ్ము కోసం కక్కుర్తి పడి ఏసీబీ వలకు తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ చిక్కిన ఘటన గురువారం పలాసలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పలాసలో తూనికలు కొలతల ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీధర్ తన పరిధిలోని సుమారు 14 మండలాల్లో వ్యాపారులను నిత్యం వేధించేవాడు. కిరాణా షాపు మొదలు పెద్దపెద్ద షాపుల్లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ కాటాల విషయంలో ప్రతీ ఏడాది వెరిఫికేషన్ సర్టిఫికెట్ కోసం వ్యాపారుల నుంచి లంచాలు తీసుకునేవాడు. గత ఏడాది అక్టోబర్ నుండి వెరిఫికేషన్ సర్టిఫికెట్ల పేరుతో వ్యాపారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ప్రతి ఏడాది ఎలక్ట్రికల్ కాటాలు ఉన్న షాపు యజ మానులు అవి సరిగా ఉన్నాయా లేదా అన్న విషయమై 300 రూపాయలు చలానా ప్రభుత్వానికి తీస్తే సిబ్బంది వచ్చి వాటిని పరిశీలించి ప్రభుత్వ సీలును వేస్తారు. ఈ తతంగం ముగిసిన తరువాత తూనికలు కొలతల శాఖ నుంచి ఆ షాపు యజమానికి వెరిఫికేషన్ సర్టిఫికెట్ అందించాల్సివుంటుంది. దీన్ని అదునుగా చేసుకుని ఇన్స్పెక్టర్ శ్రీధర్ అక్రమ సంపాదనకు ఓ మార్గంగా మార్చుకున్నాడు. ప్రభుత్వానికి కడుతున్న 300 రూపాయల చలానాతో పాటు తన వాటాగా ఒక్కో షాపు నుండి 400 రూపాయలు అదనంగా చెల్లించాలని వ్యాపారులపై ఒత్తిడి తెచ్చాడు. ఇందుకు వ్యాపారులు అంగీకరించకపోవడంతో గత ఏడాది అక్టోబర్ నుండి ఇప్పటివరకు తన పరిధిలో ఉన్న 475 షాపులకు వెరిఫికేషన్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిలిపివేశాడు. ఆ షాపులకు వెళ్లి వెరిఫికేషన్ సర్టిఫికెట్లు ఎందుకు లేవంటూ వాళ్ల పైన దబాయించే ప్రయత్నం చేసేవాడు. ఈ మొత్తం షాపులకు గాను 1 లక్షా 78 వేల రూపాయలు తీసుకువస్తేనే సర్టిఫికెట్లు మంజూరు చేయడం జరుగుతుందని లేకపోతే కేసులు పెడతానంటూ వ్యాపారులను బెదిరించేవాడు. దీంతో ఏం చేయాలో పాలు పోనీ వ్యాపారులు మూకుమ్మడిగా ఈ అధికారిపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి పక్కా ప్లాన్ వేశారు. తమ వద్ద ఉన్న నోట్లకును ఇన్స్పెక్టర్ శ్రీధర్‌కు అందించాల్సిందిగా వ్యాపారులను పురమాయించారు. గురువారం వ్యాపారులు వద్ద ఆ డబ్బును తీసుకుంటుండగా ఇన్స్పెక్టర్ శ్రీధర్‌ని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేశామని, శుక్ర వారం కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ రమణ మీడియాకు వివరించారు. ఆయన వెంట సీఐ భాస్కరరావు ఉన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546